సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



భారీగా చేరికలు

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు జరుగుతున్నాయి. వందలాది మంది చేరుతున్నారు.

- 8లో



పార్కులకు ఫుల్ మార్కులు

పార్కులపై అభివృద్ధి మార్కులు కనిపిస్తున్నాయి. అన్నీ అభివృద్ధికి నోచుకున్నాయి.

- 8లో

సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం



నరసన్నపేట: సివిల్స్ ఫలితాల్లో 467వ ర్యాంకు సాధించిన బాన్న వెంకటేష్‌ను నరసన్నపేట మండలం బసివలసలో ఆదివారం గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. వెంకటేష్ అమ్మమ్మ మెండ నర్సమ్మ, మేనమామ ధిల్లీశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు సత్కరించారు.

న్యూస్‌రీల్

'సీఎం వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేయాలి'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 24న శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 23వ తేదీ రాత్రికి ముఖ్యమంత్రి ఎచ్చెర్ల చేరుకుని అక్కడే బస చేస్తారని, రెండో రోజు 24న శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల మీదుగా సీఎం బస్సు యాత్ర సాగుతుందని పేర్కొన్నారు. అనంతరం టెక్కలి చేరుకుని మేమంతా సిద్ధం పేరుతో ప్రచార సభలో పాల్గొని సిద్ధం బస్సు యాత్ర ముగిస్తారని తెలిపారు. ఈ పర్యటనని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నందున జిల్లాలోని మంత్రులు, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, పార్టీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థులు, అన్ని విభాగాల పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో కృష్ణదాస్ నామినేషన్



ఆన్‌లైన్ నామినేషన్ ఫారాలపై సంతకాలు చేస్తున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: నరసన్నపేట అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ఆన్‌లైన్‌లో నామినేషన్ వేశారు. కుటుంబ సభ్యులతో మబగాంలోని గ్రామ దేవత ఆలయంలో మొక్కులు చెల్లించి, రాళ్లపాడు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆన్‌లైన్ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో నామినేషన్ పత్రాలను అప్‌లోడ్ చేశారు. ఈ నెల 25వ తేదీ గురువారం నాడు నరసన్నపేట రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సెట్-2 నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలతో కలసి ర్యాలీగా వెళ్లనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

నేడే టెన్త్ ఫలితాల వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పరీక్ష ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్య పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. ఫలితాల కోసం విద్యార్థులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు టెన్త్‌క్లాస్ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాలను కేటాయించారు. 30574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 29,500 మంది వరకు పరీక్షలు రాశారు. కాగా టెన్త్‌క్లాస్ జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియను ఏప్రిల్ ఒకటిన ప్రారంభించి 8వ తేదీతో పూర్తిచేసి కేవలం 8 రోజుల్లో స్పాట్‌ను ముగించారు.

రికార్డు స్థాయిలో 21 రోజుల్లో ఫలితాలు..

రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఫలితాలను త్వరితగతిన వెల్లడించేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు రికార్డు స్థాయిలో కేవలం 21 రోజుల్లోనే వెల్లడిస్తుండటం గమనార్హం.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్



అధికారులకు ఎన్నికల నిర్వహణపై ఆదేశాలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

వజ్రపుకొత్తూరు: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. పూర్తి స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఆదివారం ఆయన వజ్రపుకొత్తూరు మండలంలో పర్యటించారు. ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు కీలక సూచనలు చేశారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిర్దేశాల్లో ఎలాంటి తేడా వచ్చినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. భద్రతా పరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బెండిగేటు, నగరంపల్లి కూడలి వద్ద ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ బృందం చేపడుతున్న పనులపై ఆరా తీశారు. పర్యటనలో పలాస నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారుల భరత్ నాయక్, తహసీల్దార్ కె.సురేష్, ఎంఆర్ఐ డి.పవిత్ర, ఎస్ఐ సీహెచ్ రామారావు తదితరులు హాజరయ్యారు.



గోరుముద్ద ▶ ఆరోగ్యానికి హామీ ముద్ర

మెనూ.. అద్భుతం చేసెను

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద అమలు
- వారానికి మూడురోజులు విద్యార్థులకు రాగిజావ అందజేత
- జిల్లాలో వందశాతం విద్యార్థులకు బడుల్లోనే భోజనాలు
- రుచికరంగా, ఆరోగ్యవంతంగా ఉండేలా మెనూ రూపకల్పన



పిల్లలకు రక్తహీనత రాకుండా రాగిజావ.. ప్రోటీన్ లోపం లేకుండా గుడ్లు, పౌష్టికాహార లోపం రాకుండా ఆకుకూరలు, రుచికి లోటు లేకుండా రోజుకో రకం వంటకాలు.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మెనూ ఇది. సొంత బిడ్డను చూసుకున్నంత జాగ్రత్తగా, కన్నపేగుకు తినిపించినంత ప్రేమగా వైఎస్ జగన్ సర్కారు విద్యార్థులకు గోరుముద్దలు తినిపిస్తోంది. బడికి వచ్చిన పిల్లల కడుపు నిండేలా.. పంపిన అమ్మానాన్నల మనసు సంతృప్తి పడేలా బడి భోజనాలను అందిస్తున్నారు. జిల్లాలో వందశాతం మంది పిల్లలు స్కూల్‌లోనే భోజనం చేయడమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

శ్రీకాకుళం న్యూకాలనీ: జగనన్న గోరుముద్ద.. పిల్లల పాలిట ఆరోగ్య ప్రదాయినిగా మారిన పథకం. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినడం కంటే ఇంటికి వెళ్లి తినడం మేలని పిల్లలు అనుకునేవారు. కానీ ఇప్పుడు జిల్లాలో వందశాతం మంది విద్యార్థులు బడిలోనే భోజనం చేస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన మార్పులతో బడి భోజనాన్ని విద్యార్థులు ఇష్ట పడుతున్నారు. పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటేనే చదువుకోగలరని భావించి సరికొత్తగా మెనూను రూపకల్పన చూశారు. కిచిడీ, ఫ్రైడ్ రైస్, పులిహోర వంటి వాటితో పాటు కోడిగడ్లు, చిక్కీలు మెనూలో చేర్చారు. దీంతో గతంలో బడిలో మధ్యాహ్న భోజనం తినడం మానేసిన విద్యార్థులు సైతం ఇప్పుడు ఎంతో ఇష్టంగా తింటున్నారు. అనేక పోషకాలతో కూడిన భోజనం వల్ల విద్యార్థుల్లో శారీరక మార్పులతోపాటు, దారుఢ్యం మెరుగుపడుతూ వస్తోందని అధికారులే చెబుతున్నారు.



రాగిమాల్ట్ పంపిణీ

నూరు శాతం మంది బడుల్లోనే భోజనం..

శ్రీకాకుళం జిల్లాలో ప్రైమరీ 1907, అప్పర్ ప్రైమరీ 332, హైస్కూళ్లు 333 కలిపి మొత్తం 2572 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 1,83,545 మందికిగాను జగనన్న గోరుముద్దను 1,83,313 మంది తింటున్నారు. కేవలంలో 232 మంది విద్యార్థులు మాత్రమే వివిధ అనారోగ్య, ఇతరత్రా కారణాల వల్ల ఇంటి భోజనం తింటున్నారు. గత ప్రభుత్వ హయాంలో 60 నుంచి 70 శాతం మంది మాత్రమే బడుల్లో మధ్యాహ్న భోజనం చేసేవారు. కానీ ప్రస్తుత జగన్ ప్రభుత్వ హయాంలో వంద శాతం శాతం మంది విద్యార్థులు పౌష్టిక, రుచికరమైన భోజనాలను బడుల్లో తింటుండటం విశేషం. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే/తయారుచేసే కుక్ కమ్ హెల్పర్లు 4747 పనిచేస్తున్నారు. ఎండీఎం కార్మికులకు మేలు చేసేలా జగన్ ప్రభుత్వం రూ.3వేల గౌరవ వేతనాన్ని చెల్లిస్తోంది. అలాగే నిత్యావసర వస్తువులు, సరుకుల ధరలు పెరగడంతో భోజనం తయారు చేసేందుకు అందిస్తున్న నిర్వహణ రేట్లను సైతం రెండుసార్లు పెంచి మధ్యాహ్న భోజన కార్మికులకు అండగా నిలిచింది.

మూడు మండలాల్లో అక్షయపాత్ర ద్వారా..

శ్రీకాకుళం జిల్లాలో అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ క్లస్టర్ కిచెన్ ద్వారా శ్రీకాకుళం, గార, ఆమదాలవలస మండలాల్లో ఉన్న ప్రభుత్వ బడుల్లో జగనన్న గోరుముద్దను అత్యద్భుతంగా అందిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో కలిపి మొత్తం 309 బడుల్లో 25,451 మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారు.

గోరుముద్ద ఓ వరం



నాకు తల్లిదండ్రులు లేరు. నాకు వైకల్యం ఉందని విడిచిపెట్టేశారు. అమ్మమ్మ, తాతయ్య బగ్రి ఎర్రమ్మ, రాముడు(చనిపోయారు) వాళ్ల ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాను. కొయ్యాం జెడ్పీహెచ్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాను. గోరుముద్ద నా ఆకలి తీర్చింది. మాలాంటి వారికి ఇదో వరం. విద్యా కానుక ద్వారా రూపాయి ఖర్చు లేకుండా చదువు కొనసాగుతోంది. నాకు నాలుగేళ్ల పాటు అమ్మఒడి కూడా వచ్చింది.

– బి.కరుణజ్యోతి, మోసనవానిపేట గ్రామం, ఎచ్చెర్ల మండలం

భోజనం చాలా మంచిగా ఉంటుంది..



మేము పొందూరు సమీపంలోని రాపాక జంక్షన్‌లో ఉంటున్నాం. మా నాన్న గొట్టాపు రాజు తాపీమేస్త్రిగా పనిచేస్తుంటారు. మా స్కూల్‌లో ప్రతిరోజు అందిస్తున్న జగనన్న గోరుముద్ద చాలా రుచిగా, మంచిగా అందిస్తున్నారు. ఇష్టంగా తింటున్నాం. మెనూ ప్రకారం భోజనం పెడతారు. వారంలో మూడు రోజులపాటు రాగీమాల్ట్‌ను పెడుతున్నారు.

– గొట్టాపు వెంకటేష్, 9వ తరగతి, జెడ్పీహెచ్‌స్కూల్ పొందూరు



పిల్లల ఆరోగ్యం కోసం రాగిజావ

సీఎం జగన్ ఆదేశాల మేరకు 2023 మార్చి 11 నుంచి రాగిజావను అందుబాటులోకి తీసుకొచ్చారు. వారంలో మూడు రోజులపాటు ఉదయం 9 నుంచి 10 గంటల సమయంలో గోరుముద్ద ద్వారా రాగిమాల్ట్‌ను అందజేస్తున్నారు. బెల్లంతో కూడిన ఈ రాగిమాల్ట్‌ను తాగడం వల్ల ఆరోగ్యంతోపాటు ఐరన్ సమపాళ్లలో లభిస్తుందని వైద్యులు సైతం ప్రభుత్వాన్ని మెచ్చుకుంటున్నారు.



జగనన్న గోరుముద్ద భోజనం మెనూ ఇది..

- **సోమవారం:** హాట్‌పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు/కూరగాయల పులావ్, కోడి గుడ్డు కూర, చిక్కీ అందిస్తున్నారు.
- **మంగళవారం:** పులిహోర, టమాట పచ్చడి/దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడి గుడ్డు.
- **బుధవారం:** వెజిటబుల్ రైస్(కూరగాయల అన్నం), ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
- **గురువారం:** సాంబార్ బాత్, ఉడికించిన గుడ్డు.
- **శుక్రవారం:** అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ.
- **శనివారం:** ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపి(స్వీట్) పొంగల్ అందిస్తున్నారు.

ఇంట్లో కంటే బాగా ..



మా పాప పేరు కూటికుప్పల సృజన. జెడ్పీహెచ్ స్కూల్ తొగరాంలో 9వ తరగతి చదువుతోంది. ఉదయం, రాత్రి మా పాప ఇంటిలోనే తింటుంది. మధ్యాహ్నం బాక్స్ ఇస్తానన్నా వద్దంటుంది. ఇంట్లో కంటే స్కూల్‌లో భోజనం బాగుంటుందని చెబుతుంది. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. మాకు కావాల్సింది కూడా అదే. మా పాప ఆరోగ్యంగా, సంతోషంగా ఉండటమే కావాలి.

– కూటికుప్పల ఉషారాణి, కొత్తవలస గ్రామం, ఆమదాలవలస మండలం



రూ.22 లక్షలు గోల్‌మాల్

- డ్వాక్రా సంఘాల రుణాలు మింగేసిన సీఎఫ్
- నెలివాడలో వెలుగు చూసిన అక్రమాలు
- జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

రణస్థలం: మండలంలోని నెలివాడ పంచాయతీ పరిధిలో ఉన్న 14 డ్వాక్రా సంఘాల రుణాల సంబంధిత నిధులు రూ. 21లక్షల 89వేలు గోల్‌మాల్ అయ్యాయి. సీఎఫ్‌తో పాటు ఆమె భర్త ఇందులో ప్రధాన నిందితులు. ఈ మేరకు ఆయా డ్వాక్రా సంఘాల మహిళలు జేఆర్ పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీ మహాలక్ష్మి, శ్రీ సాయిరాం, కంచమ్మతల్లి, విఘ్నసాయి డ్వాక్రా గ్రూప్ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. నెలివాడలో సీఎఫ్‌గా ముక్కు(యండ) శ్యామలమ్మ పని చేస్తున్నారు. ఆమె భర్త యండ వెంకటేష్ బ్యాంక్ కరస్పాండెంట్ పాయింట్ ఉద్యోగిగా ఉన్నారు. ఏడాది కాలంగా గ్రూప్ సభ్యులు కడుతున్న రుణ వాయిదాలను వీరు పైడిభీమవరం ఏపీజీవీ బ్యాంక్‌లో జమ చేయాల్సి ఉన్నా.. చేయలేదు. బ్యాంకులో ఓవర్ డ్యూ వచ్చే సమయానికి ఎంతో కొంత జమ చేసి కాలం గడిపేవారు. సంఘ సభ్యులకు అనుమానం రాకుండా డూప్లికేట్ రశీదులు ఇచ్చేవారు. బ్యాంకు అధికారుల నుంచి కూడా సభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. వెలుగు ఉద్యోగులు గ్రామంలోకి వచ్చి డ్వాక్రా రుణాల రికార్డు పుస్తకాలు నెలివాడ నుంచి రావడం లేదని అడిగారు. అప్పుడే సీఎఫ్ శ్యామలమ్మ, ఆమె భర్త వెంకటేష్ చేసిన మోసం బయటపడింది. దీంతో డ్వాక్రా సంఘ సభ్యులంతా కలిసి జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వెలుగు ఏపీఎం ఎంవీ రత్నంను వివరణ కోరగా సోషల్ ఆడిట్‌లో భాగంగా నెలివా డ నుంచి రికార్డులు రావడం లేదని గుర్తించి పదిహేను రోజులుగా దర్యాప్తు చేస్తున్నామని, సుమారు రూ. 22 లక్షలు వరకు డ్వాక్రా రుణాల నగదు జమ బ్యాంకులో చేయలేదని గుర్తించామని, ఇప్పటికే మహిళ సంఘాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఏపీజీవీ బ్యాంక్ మేనేజర్ కిరణ్‌ను వివరణ కోరగా సీఎఫ్ శ్యామలమ్మ సుమారు రూ. 12 లక్షలు పైచిలుకు డ్వాక్రా రుణాలు కట్టాల్సి ఉందని, ఇటీవలే రూ. 6లక్షలు జమ చేశారని, పూర్తి స్థాయిలో రికవరీ చేసేలా చర్యలు చేపడతామని చెప్పారు.

పెళ్లింట విషాదం

- వివాహ మండపంలో విద్యుత్ షాక్
- ఒకరి మృతి
- 12 మందికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



సీతమ్మ మృతదేహం

రణస్థలం: రాత్రి 8 గంటలకు పెళ్లి ముహూర్తం. వధూవరులు, బంధువులు అంతా వివాహ వేదిక వద్ద ఉన్నారు. పురోహితులు మంత్రాలు చదువుతున్నారు. మరో ఐదు నిమిషాల్లో తాళి కట్టాల్సి ఉండగా.. ఘోరం జరిగిపోయింది. పెళ్లి మండపంలో విద్యుత్ షాక్ కొట్టడంతో ఒకరు చనిపోగా.. 12 మంది గాయపడ్డారు. అప్పటి వరకు మేళతాళాలు, పెళ్లి మంత్రాలతో సందడిగా ఉన్న ఆ వేదిక ఒక్కసారిగా ఆర్తనాదాలతో మార్మోగిపోయింది. మండలంలోని అల్లివలస గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

గ్రామానికి చెందిన మైలపల్లి లక్ష్మడు ఇంటిలో వివాహ వేడుక జరుగుతోంది. 8 గంటలకు తాళి కట్టాల్సి ఉండగా సరిగ్గా 7.55 నిమిషాలకు మైకు పట్టుకుని మంత్రాలు చదువుతున్న పురోహితునికి విద్యుత్ షాక్ కొట్టింది. అటువైపు చూసేలోగానే మరో 11 మంది విద్యుదాఘాతానికి గురయ్యారు. దీంతో వివాహానికి వచ్చిన వారంతా చెల్లాచెదురైపోయారు. అప్పటికప్పుడు ఆటోలు కట్టించి క్షతగాత్రులను రణస్థలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే జీడిపాలెం గ్రామానికి చెందిన అంబటి సీతమ్మ(45) దారిలో మృతి చెందారు. ఎం.లక్ష్మడు, సూరాడ రవణమ్మ, మైలపల్లి రేవంత్, మైలపల్లి లక్ష్మి, గుంటు లక్ష్మి, సూరాడ చిలకమ్మ, గుంటు ఎల్లమ్మ, మైలపల్లి ఎర్రన్నతో మరికొందరిని ఆస్పత్రిలో చేర్చారు. ఏఎస్ఐ ఉమామహేశ్వరరావు ఆస్పత్రికి వచ్చి పరిశీలించారు.

అక్కవరం వద్ద సీఎం సభ

- సభా స్థలాన్ని పరిశీలించిన టూర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రఘురాం, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24న టెక్కలిలో చేపడుతున్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర సభా స్థలాన్ని ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం టూర్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు జాతీయ రహదారిపై అక్కవరం ఎదురుగా స్థలాన్ని పరిశీలించి ఖరారు చేశారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర కార్యక్రమాన్ని టెక్కలిలో ప్రతిష్టాత్మకంగా ముగిస్తున్నామని రఘురాం వెల్లడించారు. ముగింపు సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. అలాగే ఏర్పాట్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు నాయకులు చింతాడ గణపతి, ఏపీ ఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్, వి.శ్రీధర్‌రెడ్డి, ఆర్.మురళీరెడ్డి, జి.తే[illegible]జా, ఆకుల వెంకటేశ్వరరావు, బి.రా[illegible]జేష్ తదితరులు ఉన్నారు. సభా [illegible] స్థలాన్ని ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం పరిశీలించారు. జాతీయ రహదారికి ఆనుకుని అక్కవరం సమీపంలో ఖరారు చేసిన స్థలానికి చేరుకుని భద్రతా అంశాలను పరిశీలించారు.



అక్కవరం వద్ద సీఎం సభకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం టూర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

ప్రచార పర్వం

ఆత్మీయత



ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ ప్రచారంలో జోరు చూపిస్తున్నారు. పలాసపురం పంచాయతీలో ప్రచారం చేస్తూ దివ్యాంగునితో ఇలా ఆత్మీయంగా మాట్లాడారు. - సోంపేట

ఆదరణ



పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మారుమూల గ్రామాల్లో కలియ తిరుగుతున్నారు. ఆళ్లి పంచాయతీ తామర గూడ జీడితోటల్లో గిరిజనులతో కలిసిపోయి వారి యోగక్షేమాలు కనుక్కున్నారు. - కొత్తూరు

ఆలంబన



టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ కోటబొమ్మాళి మండలంలో ప్రచారం నిర్వహించారు. మంచాలపేటలో దారిలో కనిపించిన ఓ వృద్ధురాలితో ఇలా ప్రేమగా సంభాషించారు. - కోటబొమ్మాళి

క్లుప్తంగా

త్వరలో నాన్నతో సినిమా



హీరో ఆకాష్ పూరికి జ్ఞాపికను అందజేస్తున్న మండవిల్లి రవి

అరసవల్లి: తన తండ్రి పూరి జగన్నాథ్ దర్శకత్వంలో త్వరలోనే మంచి యాక్షన్ సినిమా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వర్ధమాన హీరో ఆకాష్ పూరి ప్రకటించారు. ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి సాదరంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆకాష్ మాట్లాడుతూ నాన్నతో సినిమా అంటే అది ఎప్పటికీ ప్రత్యేకంగా ఉండేలా కష్టపడతానని, ప్రస్తుతం ఓ లవ్ యాక్షన్ సినిమా షూటింగ్ నడుస్తుందని వివరించారు. అరసవల్లిలో అరుణహోమం, సౌర హోమాన్ని కూడా చేయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

బెల్లం ఊటలు ధ్వంసం

నందిగాం: మండలంలోని హర్షబడ పంచాయతీ వెంకటాపురంలో బెల్లం ఊటలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ధ్వంసం చేశారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ గంగాధరం ఆదేశాల మేరకు టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖరనాయుడు, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు చేసి 1100 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు.

ఏకగ్రీవంగా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నికలు



ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న హనుమంతు సాయిరాం

శ్రీకాకుళం అర్బన్: ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం శ్రీకాకుళం ఏపీ ఎన్జీవో సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమనాయుడు ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, సెక్రటరీ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వేణుగోపాల్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కె.మోహనరావు వ్యవహరించారు. నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు ఎస్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వై.శ్రీనువాసరావు, పైల శంకర్ తదితరులు హాజరయ్యారు.

కార్యవర్గమిదే..

సంఘం అధ్యక్షునిగా సీహెచ్ ఉమాశంకర్, కార్యదర్శిగా ఎ.తారకేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎం.లక్ష్మణరావు, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

బైక్ బోల్తాపడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హిరమండలం: మండలంలోని భగిరథీపురం–బొంతు రహదారి కోదూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సారువకోట మండలం దాసుపురం గ్రామానికి చెందిన సిద్దమడుగుల శంకరరావు(26)అద్దాలు ఫిటింగ్ పనిచేస్తూ సాగిస్తున్నాడు. రెండున్నరేళ్ల కిందట హిరమండలం మండలం చవితిసీదికి చెందిన ఆశాతో వివాహం జరిగింది. ప్రస్తుతం గర్భిణి కావడంతో కన్నవారింట ఉంటోంది. శనివారం సాయంత్రం శంకరరావు పని ముగించుకుని కోదూరులోని అక్క ఇంటికి బైక్‌పై వెళ్లారు. భోజనం చేశాక అర్ధరాత్రి సమయంలో అత్తవారింటికి బయలుదేరాడు. కోదూరు నుంచి కిలోమీటర్ దూరం వెళ్లేసరికి బైక్ అదుపు తప్పడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. భార్య ఆశా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నారాయణస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పాతపట్నం పీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: మందస మండలం కొత్త కమలాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. కవిటి మండలం దూగానపుట్టుగ గ్రామానికి చెందిన బల్ల జోగారావు(52)తన బంధువులు శేషమ్మ, జశ్వంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వజ్రపుకొత్తూరు మండలం ధర్మపురం ఓ భోజన కార్యక్రమానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో జోగారావు తల నుజ్జవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శేషమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. జశ్వంత్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధిత మహిళను చికిత్స నిమిత్తం హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్కులకు.. ఫుల్ మార్కులు



సుందరంగా శ్రీకాకుళంలోని గాంధీ పార్కు



నాగావళి రివర్ వ్యూ పార్కు

- వైఎస్సార్‌సీపీ పాలనలో ఆహ్లాదకరంగా మార్పు
- కోట్లాది రూపాయలతో శ్రీకాకుళంలో పార్కుల సుందరీకరణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న నగర వాసులు

అభివృద్ధి పథం సంక్షేమ రథం

టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన పార్కులు వైఎస్సార్ సీపీలో అభివృద్ధి బాటపట్టాయి. ఒకప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా ఉండే ఈ ఉద్యానవనాలు నేడు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చిన్నారుల నుంచి వృద్ధులు వరకు సాయంత్రం పూట సరదాగా పార్కుకు వెళ్తా చల్లని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఈ ఐదేళ్లలో శ్రీకాకుళం నగరంలోని పార్కులకు రూ 2.75కోట్లు, జాతీయ రహదారిని అనుకున్న ఉన్న విజయాదిత్యా పార్కుకు రూ 2.54 కోట్లు కేటాయించి అందంగా తీర్చిదిద్దారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో మిగిలిన పార్కులకు సైతం నిధులు మంజూరు చేసి చక్కగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం కొన్ని అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



గాంధీ పార్కులో చిన్నారుల ఆట పరికరాలు



పార్కులో వ్యాయామ పరికరాలు



పీఎన్‌కాలనీ జీరోలైన్ పార్కులో యోగా చేస్తున్న మహిళలు



పార్కులో ఆటలాడుకుంటున్న చిన్నారులు

పార్కు	అభివృద్ధికి వెచ్చించిన నిధులు(రూ.లలో)
విజయాదిత్య పార్కు	రూ.2.54 కోట్లు
చల్ల నర్సింహులు పార్కు	రూ.35 లక్షలు
పద్మావతినగర్ కాలనీ పార్కు	రూ.15లక్షలు
పీఎన్ కాలనీ జీరో లైన్ పార్కు	రూ.50.60 లక్షలు
డైమండ్ పార్కు	రూ.14లక్షలు
గాంధీమందిరం (స్మృతివనం)	రూ.12లక్షలు
కార్గిల్ పార్కు(సుడా)	రూ.40లక్షలు
కల్చరల్ పార్కు(డీసీసీబీ కాలనీ)	రూ.12లక్షలు
జగన్నాథనగరకాలనీ	రూ.2లక్షలు
నాగావళి రివర్వ్యూ పార్కు	రూ.23 లక్షలు
రివర్వ్యూపార్కు (గుడివీధి)	రూ. 7.70లక్షలు
గాంధీపార్కు (7 రోడ్ జంక్షన్)	రూ.7.20లక్షలు
ఇందిరా ప్రియదర్శిని పార్కు (ఓల్డ్ ఏపీహెచ్‌బీకాలనీ)	రూ.6.95లక్షలు
వరం కాలనీ పార్కు (బలగ)	రూ.6.50 లక్షలు
ఎల్‌బీఎస్ పార్కు (గూనపాలెం)	రూ.7లక్షలు
ఉడా పార్కు (ఆర్అండ్‌బీ బంగ్లా)	రూ.3.15 లక్షలు
న్యూఏపీహెచ్‌బీ కాలనీ పార్కు	రూ.8లక్షలు
కొయ్యాన కన్నయ్య కాలనీ పార్కు	రూ.2లక్షలు
పెద్దపాడుటీచర్స్‌కాలనీ పార్కు	రూ.20లక్షలు

విశాఖ-బీ కాలనీలో 7 తులాల బంగారం చోరీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని విశాఖ-బీ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం అర్ధరాత్రి తర్వాత ఏడు తులాల బంగారం చోరీ జరిగిందని రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. గుడ్ల శేషగిరిరావు తన భార్యతో కలిసి విశాఖ-బి కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా వివాహం జరిగి అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. వేసవి కావడంతో అపార్ట్‌మెంట్ పైన టెంట్ హౌస్‌లో కొద్ది రోజులుగా నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలోని లాకర్‌లో భద్రపరిచిన 7 తులాల బంగారు ఆభరణాలు పట్టుకుపోయారని శేషగిరిరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ వాసుదేవరావు, క్లూస్‌టీం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

కోత మిషన్ పడి యువకుడికి తీవ్ర గాయాలు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టికి చెందిన రాయల జగదీష్ అనే యువకుడిపై కర్రకోత మిషన్ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. జగదీష్ ఇంటి వద్దే కార్పెంటర్ పని చేస్తున్నాడు. ఆదివారం ఉదయం అత్యవసర పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కర్రలు కోసే మిషన్ తగిలింది. మెడకు తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు 108 ద్వారా టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

పేదల ఆశాజ్యోతి సీఎం జగన్



సూర్యారావును సన్మానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్ల పాలన ఒక భాగమైతే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలన అందుకు భిన్నంగా, అద్భుతంగా ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. దివంగత వైఎస్సార్ పేదల కోసం ఒక అడుగు ముందుకేసి పాలన సాగిస్తే మరో వంద అడుగులు ముందుకేసి పేదల ఆశాజ్యోతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచేలా పాలన సాగించారని చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన చలపాక సూర్యారావు పుట్టిన రోజు వేడుకలకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో నిరుపేదల కోసం భూమిని సేకరించి వాంబేకాలనీ నిర్మించారని, మరికొంతమందికి ఇవ్వాలని సాంఘికసంక్షేమశాఖ సేకరించిన రెండెకరాల భూమిలో టీడీపీ కార్యాలయం నిర్మించుకోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.12,800 కోట్లతో 31 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చామన్నారు. చంద్రబాబు హాయాంలో సెంటుభూమి ఇవ్వలేదు సరికదా తిరిగి పేదల భూమిని దోచుకున్నారని ధ్వజమెత్తారు. ఇరుకురోడ్లుల్లో సైతం ప్లాన్లు ఇచ్చి నిర్మాణాలు చేసుకునే అవకాశమైన సర్క్యులేషన్ ప్యాట్రన్ తీసుకొచ్చింది ఒక్క శ్రీకాకుళం కార్పొరేషన్‌లోనే అని మంత్రి పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణులంతా అండగా ఉండాలని కోరారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయాచారి, మంతిన హరనాథరావు, సాతివిల్లి శ్రీనివాసరావు, అనుపోజు శ్రీధర్, కోటిపల్లి మోహనరావు, అనుపోజు కోటిబాబు, గాడి గణపతి ఆచారి, సుగంధం సంజీవరావు, నల్లబాటి కృష్ణ, డాకోజీ వెంకటరావు, భవాని, ధర్మారావు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, విజయ్‌భాస్కర్, గులోనా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



కాశీబుగ్గ: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సిర్ల రవిచంద్రకు వైఎస్సార్‌సీపీ కండువా వేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు



ఇచ్ఛాపురం: జనసేన నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు

కాశీబుగ్గ: పలాస పార్టీ కార్యాలయం వద్ద మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు సిర్ల రవిచంద్ర తన అనుచరు సుమారు 500 మందితో పలాస ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగు దేశం పార్టీకి వెళ్లిపోయిన వ్యక్తే తనను ఇన్నాల్లూ పార్టీలోకి రాకుండా అడ్డుకున్నారని చెప్పారు. సీదిరి అప్పలరాజును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావుదొర, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ఎస్‌పీవీ గ్రూప్ చైర్మన్ తమలంపూడి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బల్ల శ్రీనివాస్, బడగల బల్లయ్య, అందాల శేషగిరి, బడగల బల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకి చెందిన జనసేన నాయకులు బి.మహేష్‌తో పాటు 200 మంది మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ముందుగా భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లి, ఆశి పురుషోత్తం, పార్టీ నాయకులు పిలక సంతు, కాళ్ల సత్యం, పరపటి కోటిరెడ్డి, నీలాపు ఢిల్లి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని 3వ వార్డు శివాజీనగర్‌లో టీడీపీకి చెందిన యండమూరి వెంకటరమణ, బొడ్డు పాపారావు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు సింహాచలం, వార్డు కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, యండమూరి బోగేశ్వరరావు, బదకల బాలమ్మ పులిరాజు, బూత్ కన్వీనర్ దొక్కరి దిలీప్‌కుమార్ యాదవ్, యు.ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో 36వ డివిజన్ దమ్మలవీధికి చెందిన పలువురు కార్యకర్తలు మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ సూర్యం, కన్నబాబు, కోనాడ నర్సింగరావు, ఫాల్గుణరాజు, గనగళ్ళ పోలీసు, మోసరవి, పొట్టెమ్మ, వాసు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: హిరమండలం మండలంలోని కిట్టలపాడుకి చెందిన టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ గొంటి లజపతిరావు, ఎస్ఎంసీ చైర్మన్ కలిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబర్ పొగాటి మొఖలింగం, పారశెల్లి అప్పలనాయుడు తదితర 200 కుటుంబాల వారు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏ.వి.సురేష్, నాయకులు ప్రసాదరావు, ఎంపీటీసీ గంగధరరావు, ఉప సర్పంచ్ ఫల్గునరావు పాల్గొన్నారు. హిరమండలం మండలం గులుమూరుకు చెందిన టీడీపీకు చెందిన 12 కుటుంబాలు పల్లా భూషణరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. హిరమండలం మండలం పెద్దగూడకు చెందిన ఎస్.బుడ్డయ్య, ఎస్.ప్రసాద్ తదితర పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.

ఎల్.ఎన్.పేట: మండలంలోని కోవిలాం పునరావాస కాలనీ, బొర్రంపేట గ్రామాలకు చెందిన సుమారు 200 కుటుంబాలు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా జెడ్పీటీసీ కిలారి త్రినాథులు ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆయనతో మండల రాజకీయ పరిస్థితులను చర్చించారు. అనంతరం కోవిలాం కాలనీ వద్ద వైఎస్సార్ సిపీ నాయకులు లోచర్ల మల్లేశ్వరావు, కెల్ల గణపతి, గండివలస ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో వంశధార నిర్వాసితులు గండివలస శ్రీరాములు, కృష్ణవేణి తదితరులు, బొర్రంపేటకు చెందిన సర్పంచ్ బొడ్డేపల్లి రమణమ్మ, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, బొడ్డేపల్లి చిట్టిబాబుల ఆధ్వర్యంలో మామిడి అన్నాజీరావు, కంచరాన అన్నాజీ తదితరులు వైఎస్సార్ సీపీ చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, నాయకులు శిమ్మ సాంబశివరావు, ఈగల చిన్నారావు, లుకలాపు సుధీర్, తొత్తడి మురళీ కృష్ణ, యారబాటి గణపతి, గాది కోటేశ్వరరావు, రెడ్డి సీతారాం, టి శోభన్‌బాబు, బలగ గోవిందరావు, ముద్దాడ లక్ష్మణరావు, పల్లి సంజీవ్, గేదెల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం రూరల్: పార్టీలో చేరిన దమ్మలవీధి కార్యకర్తలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు



పాతపట్నం కిట్టలపాడు గ్రామస్తులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: టీడీపీ నాయకుడు మామిడి అన్నాజీకి కండువాలు వేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట:టీడీపీ నుంచి వైసీపీ వంశధార నిర్వాసితులకు కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కాశీబుగ్గ: మంత్రి అప్పలరాజు సమక్షంలో పార్టీలో చేరిన 3వ వార్డు శివాజీనగర్ వాసులు